నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ రాకేష్ కుమార్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ హ్యాండయ్ ఫీడర్ పరిధిలోని మెరిడియన్ స్కూల్ ప్రాంతం, ఎస్ కన్వెన్షన్ లైన్, బుట్ట కన్వెన్షన్ ప్రాంతాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మంత్రి జూపల్లికి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం సభ్యులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, కల్చరల్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును గురువారం పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి, ఎల్లమ్మబండలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభోత్సవం, సంస్థ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎంఏ కరీమ్, గోపాస్ రవీందర్, గోపాస్ చంద్రశేఖర్, సంకి సత్యం, డి.కుర్మయ్య, బండి బంగారి, సాయన్న, డి.సత్యనారాయణ, ఆర్టీసీ ఆనంద్, సాయి పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవం



ఆలయం పాలకమండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న అధికారులు

మూసాపేట: మూసాపేటలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఛైర్మన్‌గా తూము శ్రీహరి పటేల్, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీతామహేందర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు సత్యం శ్రీరంగం, కార్పొరేటర్ మహేందర్, మాజీ కార్పొరేటర్లు బాబూరావు, తూము శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్, పోచమ్మ ఆలయం ఛైర్మన్ ఎల్లేష్ యాదవ్, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మాటలు కలిపి..

నగదు దోచేసి.!

నలుగురు నిందితుల అరెస్టు

మూసాపేట: ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తిని ఇద్దరు మహిళలు మాటలు కలిపి ఆటోలో ఎక్కించుకొని వెళ్తూ దారిలోనే అతడి నుంచి రూ.8వేల నగదు, పర్సు తీసుకొని పరారయ్యారు. ఈ కేసులో ఇద్దరు మహిళలు, ఇద్దరు వ్యక్తులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. నలుగురిపై గతంలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జర్పతి పాండు (26) ఆటో డ్రైవర్ లింగంపల్లి శాంతి నగర్‌లో నివాసముంటున్నాడు. జర్పతి యాదయ్య (38) కూలిపని చేస్తుంటాడు. ఇద్దరు భార్యలైన జర్పతి మల్లమ్మ (28), ఒరుసు నీలమ్మ (30) వీరందరూ కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 19వ తేదిన రాత్రి 9.30 గంటలకు జగద్గిరిగుట్టలో నివాసముండే మహేష్, అతని స్నేహితులు మియాపూర్‌నుంచి అతని ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో భాగ్యనగర్‌కాలనీ వద్ద టీ తాగేందుకు ఆగారు. మహేష్ స్నేహితుడు టీ తాగేందుకు లోపలకు వెళ్లగా మహేష్ రోడ్డుపై ఫోన్ మాట్లాడుతూ ఉన్నాడు.

◆ ఇద్దరు మహిళలు మల్లమ్మ, నీలమ్మలు వచ్చి మహేష్‌తో మాటలు కలిపి రెండు వేల రూపాయలకు వ్యభిచారానికి మాట్లాడుకున్నారు. వెంటనే ఆటో తీసుకుని జేఎన్‌టీయూ వైపు వెళుతున్నారు. మార్గమధ్యలోనే ఆటోలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతను ఇవ్వకపోవటంతో బెదిరించి దాడి చేశారు. మహేష్ ఆటో డ్రైవర్‌ను తలపై కొట్టడంతో ఆటో పల్టీ కొట్టింది. యాదయ్య, పాండు, మల్లమ్మ, నీలమ్మలు కలిసి అతని వద్ద ఉన్న రూ.8వేల నగదు, పర్సు తీసుకొని ఆటోలో పరారయ్యారు.

◆ బాధితుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే పాండుపై 2015 నుంచి సనత్‌నగర్ జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, మియాపూర్, చందానగర్, దుండిగల్, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 19 కేసులు నమోదు అయ్యాయి. యాదయ్యపై 2019 నుంచి మియాపూర్‌లో 4, ఆర్‌సిపురంలో 2 కేసులు నమోదయ్యాయి. ఇద్దరు మహిళలపై కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు ఉన్నట్లు పోలీసులు వివరించారు.

మీరు రక్తం ఇవ్వండి..



నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాధవరం కాంతారావు, బీజేపీ నాయకులు



మూసాపేటలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, బాబురావు

అసలు సిసలైన దేశభక్తుడు నేతాజీ..

మీకు స్వాతంత్ర్యం ఇస్తాను!



ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

స్వాతంత్ర్య సమర పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటం అనేది అహింసా మార్గంలోనే కాదు... వీర మార్గంలోనూ పోరాడవచ్చని ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటిషర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారని అన్నారు. ''మీరు నాకు రక్తం ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను''ఆయన ఇచ్చిన నినాదం భారతీయుల్లో దేశభక్తిని రగిలించిందన్నారు. ఈ నినాదం ఆజాద్ హింద్ ఫౌజ్‌లో లక్షల్లో యువత చేరేలా ప్రేరేపించిందని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే అఖండ భారతదేశంపై పట్టు సడలిపోతుందని బ్రిటిషర్లు ఎన్నో కుట్రలు పన్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటంలో ఆయన కీలకపాత్ర వహించారన్నారు. భారత ప్రభుత్వం నేతాజీ జయంతిని పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తోందని తెలిపారు. విశ్వగురు రవీంద్రనాథ్ ఠాగూర్ నేతాజీని దేశ్ నాయక్ అనే బిరుదును అందించారని అన్నారు. నేటి యువత సుభాష్‌చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలన్నారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం





జేఎన్‌టీయూహెచ్‌లో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు, జేఏసీ నాయకులు



మూసాపేట జనతానగర్‌లో నేతాజీ విగ్రహానికి యూత్‌కాంగ్రెస్ నాయకుల నివాళులు



పంచశీల స్కూల్‌లో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీనివాస్



జయభారత్‌నగర్ కాలనీలో కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలు



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



దీనబంధు కాలనీలో నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్, తదితరులు

'పరీక్షల విభాగం డైరెక్టర్ అరుణకుమారిని తొలగించాలి'



జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ డా.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: విద్యార్థుల మార్కులలో అక్రమాలకు కారణమైన జేఎన్‌టీయూహెచ్ ఎగ్జామినేషన్ డైరెక్టర్ అరుణకుమారిని సస్పెండ్ చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావుకు గురువారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర యూనివర్సిటీల కోకన్వీనర్ నూకల నాగరాజు మాట్లాడుతూ.. గతంలో అరుణ కుమారిపైన అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అరుణ కుమారిని తెలంగాణ పీజీసెట్ కన్వీనర్‌గా కొనసాగించటం తగదన్నారు. జేఎన్‌టీయూహెచ్ అనుబంధ కాలేజీల సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి సబ్జెక్టుకి లక్ష చొప్పున వసూలు చేసి ఆయా సబ్జెక్టులను పాస్ చేయటం ద్వారా జేఎన్‌టీయూహెచ్ ప్రతిష్ఠను దిగజార్చారని తెలిపారు. పరీక్షల విభాగం డైరెక్టర్ అక్రమాలపై జేఎన్‌టీయూహెచ్ విచారణ కమిటీ వేసినప్పటికీ ఆమెను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని వారు రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ప్రొఫెసర్ అరుణ కుమారిని ఎగ్జామినేషన్ విభాగం నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ శ్రీనాథ్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సున్నా పుజిత్, శివమణి, యశ్వంత్, రిషి తదితరులు పాల్గొన్నారు.

పాస్ చేస్తామని వసూలు చేసిన వారిని అరెస్టు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఇంజినీరింగ్, ఇతర కోర్సులు ఫెయిలైన వారిని పాస్ చేస్తామని డబ్బులు వసూలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో ఫెయిలైన విద్యార్థులను పాస్ చేయించే విధంగా విద్యార్థుల దగ్గర నుంచి లక్షల్లో వసూలు చేయటం సిగ్గుచేటన్నారు. జేఎన్‌టీయూహెచ్ పేరు దెబ్బతీయటం కోసమే ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎంత మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.. ఎన్ని లక్షలు వసూలు చేశారు.? అనే దానిపై ప్రభుత్వం స్వయంగా విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇందులో కళాశాలల హస్తం ఉంటే ఆ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు శ్యామ్‌రావు, ఎస్ఎఫ్ఐ కాప్రా ఉపాధ్యక్షుడు నిఖిల్, మనీష్, ప్రశాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటకకు చెందిన చాకలి భీమప్ప (55) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న భీమప్ప ఇంట్లో ఉన్న భార్య, కొడుకు బంధువుల వద్దకు వెళ్లి వస్తామని చెప్పి బయటకు వెళ్లారు. వారు వెళ్లిన వెంటనే భీమప్ప సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు విషయాన్ని భీమప్ప కుటుంబీకులకు ఫోన్ ద్వారా తెలపడంతో వారు వచ్చి తలుపు తెరిచి చూడగా ఉరేసుకుని కనిపించారు. దీంతో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు వచ్చి భీమప్పను పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు భీమప్ప కుమారుడు మహేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా స్ట్రే పీసెస్ వేలం

హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతమ్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ పరిధిలో మిగిలిపోయిన చిన్న విస్తీర్ణం కలిగిన ప్లాట్ల (స్ట్రే పీసెస్) వేలాన్ని ఈనెల 24న ప్రభుత్వ నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. హౌసింగ్ బోర్డు గృహ నిర్మాణ పథకాలను అమలుపరిచేందుకు వీలుకాని అక్కడక్కడ గృహాల మధ్య ఉన్న ప్లాట్లు మాత్రమే వేలానికి ప్రజలకు అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు. వేలానికి నిర్దేశించిన అత్యంత విలువైన అభివృద్ధి చెందిన ప్రాంతాలకు సంబంధించినవని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని బోర్డు ద్వారా చేపట్టే ఎల్ఐజీ, ఎంఐజీ గృహ నిర్మాణాలకు వినియోగిస్తామని తెలిపారు. అంతేకాకుండా నగరం చుట్టుపక్కల సుమారు 700 ఎకరాల హౌసింగ్ బోర్డు స్థలాలు ఉన్నాయని పేర్కొన్నారు. అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విలువైన బోర్డు భూముల పరిరక్షణకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టామని అన్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.25 కోట్లను హౌసింగ్ బోర్డుకు మంజూరు చేసిందని వెల్లడించారు. హౌసింగ్‌బోర్డు ఆధీనంలోని భూములను చట్టవిరుద్ధంగా ఆక్రమించే వారిని ఇకపై ఉపేక్షించమని అన్నారు.

ఆర్టీఏలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: వాహనదారులు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితంగా తమ గమ్య స్థానాలకు చేరుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి ఆర్టీఏ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రాణం కంటే మరేదీ ఎక్కువ కాదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత సమాజాన్ని నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. విభిన్న రూపాల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యం తీసుకువస్తున్న ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులకు అభినందనలు తెలిపారు. కాగా కేపీహెచ్‌బీకాలనీ రోడ్ నం.4లోని గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలలో ఎంవీఐ శ్రీనుబాబు రహదారి భద్రతా నియమాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తాం



మోతీనగర్: ఇందిరమ్మ రాజ్యంలో ప్రభుత్వం త్వరలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులను అందే విధంగా చూడాలని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నాయకురాలు పట్నం సునీతామహేందర్‌రెడ్డిని అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు మస్తాన్‌రెడ్డి కోరారు. గురువారం మూసాపేటలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆమెను కలిసి సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా కృషి చేయాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె అన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేదలకు పథకాలు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫోన్ లాక్కుని పరారీ

ఫిలింనగర్: రోడ్డుపై నిలబడ్డ జెప్టో డెలివరీ బాయ్ నుంచి ఇద్దరు ఆగంతకులు బైక్‌పై వచ్చి మొబైల్‌ను తస్కరించుకుపోయిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్‌పేట ప్రాంతంలోని శ్రీలక్ష్మ ఎన్‌క్లేవ్ హాస్టల్‌లో ఉండే మోహన్‌రావు జెప్టో రైడర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 1.35 గంటలకు ఎమ్మెల్యే కాలనీ రోడ్డునెంబర్–92 నుంచి తనకు వచ్చిన ఆర్డర్‌ను తీసుకువెళ్లాడు. అడ్రస్ కోసం వాకబు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఒమెగా హాస్పిటల్ వైపు నుంచి బైక్‌పై వచ్చి మోహన్‌రావు చేతిలోని రూ.16,500ల విలువైన వివో టిక్స్ మొబైల్‌ను లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్లకు వేతనాలు ఇప్పించిన రవిసింగ్



మూసాపేట: మూసాపేటలోని కార్యాలయంలో డ్రైవర్లకు కంపెనీ అందించాల్సిన మొత్తాన్ని బీఆర్‌టీయూ నేత రవిసింగ్ గురువారం అందజేశారు. పటాన్‌చెరువు ఇండస్ట్రీ ప్రాంతంలోని ఓ కంపెనీలో 21 మంది డ్రైవర్లు కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. కంపెనీ వారు డ్రైవర్లకు వేతనం ఇవ్వకుండా పనిలో నుంచి తీసివేశారు. దీంతో వారు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్‌ను కలిసి సమస్యను విన్నవించారు. దీంతో ఆయన కంపెనీ వారితో మాట్లాడి 21 మందికి రావాల్సిన మూడు నెలల మొత్తాన్ని డ్రైవర్లకు అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ.. తమకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ల వేలం పేరుతో మోసం చేయొద్దు

● రోడ్ల విస్తరణలో ప్లాట్లు పోయే ప్రమాదం ఉంది ● కొనుగోలుదారులు జాగ్రత్త వహించాలి ● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరిక

కూకట్‌పల్లి: ప్లాట్ల వేలం పేరుతో ప్రజలను మోసం చేయొద్దని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హౌసింగ్ బోర్డు అధికారులకు సూచించారు. హౌసింగ్ బోర్డు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, మున్సిపల్ చట్టాలను, మాస్టర్ ప్లాన్లను పరిగణనలోకి తీసుకోకుండా ప్లాట్లను అమ్ముకొని సొమ్ము చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా హైదరాబాద్ మాస్టర్ ప్లాన్ ప్రకారం కేపీహెచ్‌బీ కాలనీ ఏడో ఫేజ్ నుంచి గోపాల్‌నగర్ వైపు 200 ఫీట్లుగా నిర్ణయించిన రోడ్డుకు పక్కన ఉన్న 146 గజాలు, 78 (50) గజాల రెండు ప్లాట్‌లకు 80 ఫీట్ల రోడ్డును చూపుతూ అమ్మకానికి పెట్టి మోసం చేస్తున్నారని అన్నారు. ఆ రెండు ప్లాట్లను కొనుగోలు చేసేవారు భవిష్యత్‌లో రోడ్డు విస్తరణలో ప్లాట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు.

రోడ్డు విస్తరణలో ప్లాట్లు పోతే...

అధికారులు మాత్రం రోడ్డు విస్తరణలో ప్లాట్లు పోతే జీహెచ్‌ఎంసీ నష్ట పరిహారం కింద టీడీఆర్ ఇస్తారని చెబుతున్నారని.. అలా చూసినా సరే ప్లాట్ కొన్న ధరకు టీడీఆర్ ధరను పోల్చితే పావు వంతు కూడా రాదని తెలిపారు. ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా హౌసింగ్ బోర్డు భూములను వేలం వేయడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. నిజానికి వేలానికి పెట్టినప్పుడు 24 ప్లాట్లలో ఒకటి రెండు మినహా ఏ ఒక్క ప్లాట్ కూడా వాస్తు ప్రకారం చూసినా.. స్థల విస్తీర్ణం ప్రకారం చూసినా.. చివరకు ఇళ్ల నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అనుమతుల ప్రకారం చూసినా ఏ ఒకటి కూడా ఉపయోగపడదన్నారు.

అన్ని తెలుసుకొని నిర్ణయం తీసుకోండి..



కూకట్‌పల్లి ప్రాంతాలలోని ప్రజలు హౌసింగ్ బోర్డు భూములను కొనుగోలు చేసే ముందు అన్ని రకాలుగా పరిశీలించి ముందుకు సాగాలను సూచించారు. ఒక్కసారి కొనుగోలు చేసిన తరువాత హౌసింగ్ బోర్డు కానీ ఏ ఇతర ప్రభుత్వ సంస్థలు కానీ బాధ్యత వహించవని గుర్తించాలని తెలిపారు. నిజంగా నివాసయోగ్యమైన స్థలం ఉంటే కొనుగోలు చేయవచ్చునని అందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. శుక్రవారం జరిగే వేలం పరిశీలించుకొని కొనుగోలు చేయాలని తెలిపారు.

నేడే హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

● విస్తరణలో కోల్పోయే ప్లాట్లను విక్రయించొద్దన్న ఎమ్మెల్యే
● భద్రత కల్పించాలని పోలీసులను కోరిన హౌసింగ్ బోర్డు అధికారులు
● వేలంపాటపై సర్వత్రా ఉత్కంఠ

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీ స్థలాలకు శుక్రవారం వేలంపాట నిర్వహించి విక్రయించనున్న నేపథ్యంలో సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేలం పాటను హౌసింగ్ బోర్డు వెస్ట్రన్ డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కిరణ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించనుండగా హౌసింగ్ బోర్డు కార్యదర్శి, ఎస్టేట్ అధికారి పర్యవేక్షించనున్నారు. అయితే హౌసింగ్ బోర్డు అధికారులు ఖాళీ స్థలాల వేలం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని.. రోడ్డు విస్తరణలో కోల్పోయే ప్లాట్లను పేదలకు అంటగడుతున్నారని విమర్శిస్తూ స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వేలాన్ని అడ్డుకుంటామని ప్రకటించారు.

◆ దీంతో అప్రమత్తమైన హౌసింగ్ బోర్డు అధికారులు భద్రత కల్పించాలని పోలీస్ అధికారులకు లేఖ రాశారు. రోడ్డు విస్తరణకు గురయ్యే చోట వేలానికి పెట్టిన ప్లాట్లను తొలగించి, మిగతా నివాసయోగ్యమైన ప్లాట్లను అమ్ముకుంటే అభ్యంతరం లేదని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ మేరకు అధికారులను కోరినప్పటికీ స్పందన లేకపోవటంతో శుక్రవారం జరిగే వేలంపాటపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అసలు వేలం పాట జరుగుతుందా.. ఎంత మంది పాల్గొంటారు.. అడ్డుకునే ప్రయత్నాలు సఫలం అవుతాయా.? అనే మీమాంస కేపీహెచ్‌బీ కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు.